## ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం




**నెల్లూరు, ఫిబ్రవరి6,ప్రభాతవార్త,కలెక్టరేట్** పిల్లల ఆరోగ్యం మెరుగుపడి వారి మానసిక, శారీరక అభివృద్ధికి నులిపురుగుల నిర్మూలన మాత్రలు ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్ములన దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీలు, ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలు, కళాశాలలోని 19 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ ఈ మాత్రలు సోమవారం అందించాలన్నారు. ఆ రోజున విద్యార్థినీ విద్యార్థులందరూ ఖచ్చితంగా పాఠశాలలకు హాజరయ్యే విధంగా ముందుగానే తెలియజేయాలన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్వాడి కార్యకర్తలు తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల్లో రక్తహీనత తగ్గి, ఆకలి పెరిగి, పోషకాలు మెరుగుపడి చదువులపై ఆసక్తి కలుగుతుందన్నారు. వారి శారీరిక, మానసిక పురోభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. తద్వారా మెరుగైన ఆరోగ్య సమాజాన్ని నిర్మించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన కార్యక్రమానికి అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం అనే ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు కలిసి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, డిసి హెచ్ఎస్ రమేష్ నాథ్, డీఈవో బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీవో వెంకటసుబ్బయ్య, జిల్లాగిరిజనసంక్షేమ అధికారి పరిమళ, ఐసిడిఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ గ్రీన్స్ కింద నెల్లూరుకు కేటాయించిన ప్రాజెక్టుల పరిస్థితి ఏంటి?



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన పథకం కింద దీర్ఘకాలిక లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్స్ లో భాగంగా సముద్ర రంగంలో రొయ్యలకు సంబంధించి రూ. 158 కోట్ల అంచనా వ్యయంతో 2 ప్రాజెక్టులను నవంబర్ 2022లో నెల్లూరు జిల్లాలో కేంద్రం ఆమోదించిందని, ఆ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి ఏంటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం లోక్‌సభలో ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. ఆమోదించబడిన ప్రాజెక్టుల్లో ఒకటి పూర్తయిందనేది వాస్తవమేనా, అలా అయితే రెండవ ప్రాజెక్టు స్థితిగతులేంటని, ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో తెలియజేయాల న్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆపరేషన్ గ్రీన్స్ స్కీమ్ ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన కింద దీర్ఘకాలిక లక్ష్యాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు సముద్ర రంగంలో రొయ్యలకు సంబంధించిన రెండు ప్రాజెక్టులను మంత్రిత్వ శాఖ ఆమోదించిందని చెప్పారు. ఇందులో ఆల్ఫా మెరైన్ లిమిటెడ్ అనే ఒక ప్రాజెక్ట్ పూర్తయిందని, మరొక ప్రాజెక్ట్ ఫాల్కన్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ 12.12.2024న రద్దు చేయబడిందన్నారు. ప్రాజెక్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆమోద పత్రం ప్రకారం ప్రాజెక్టును అమలు చేయడంలో విఫలమైన కారణంగా ప్రాజెక్టు రద్దయిందని వివరించారు.

## ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వండి కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సూర్య తేజ సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం స్థానిక 33వ డివిజన్ నేతాజీ నగర్, వెంగళ్ రావు నగర్ పరిసర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. చెత్త సేకరణ వాహనాల ద్వారా ప్రచారం నిర్వహించి ఖాళీ స్థల యజమానులు వారి ప్రాంగణాలను శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఖాళీ స్థలాలలో అవసరమైన జంగల్ క్లియరెన్స్ చేయించి, సమాంతరంగా మట్టిని చదునుచేసి పిల్లలు ఆడుకునేందుకు వీలుగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శికి షోకాజు నోటీసు జారీ చేయమని కమిషనర్ ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పనులను డివిజన్ పరిధిలో వేగవంతం చేసి ప్రతి ఇంటినుంచి డ్రైనేజ్ కనెక్షన్ తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ బిజిలి యోజన పథకంపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానల్ ద్వారా విద్యుత్ సదుపాయం పొందేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రభుత్వ ఉద్యోగుల గృహాలలో సోలార్ ప్యానల్ ను ఏర్పాటు చేసుకొని విద్యుత్ సదుపాయం పొంది, మిగిలిన వారందరికీ ఆదర్శంగా నిలవాలని, సూర్య బిజిలి యోజన పథకంతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందాలని కమిషనర్ ఆకాంక్షించారు. తప్పనిసరిగా ప్రభుత్వ ఉద్యోగులంతా సూర్య ఘర్ బిజిలి యోజన పథకాన్ని ఏర్పాటు చేసుకునే విధంగా ఉద్యోగులందరికీ సర్క్యులర్ పంపించాలని కమిషనర్ ఆదేశించారు. ఎనర్జీ సెక్రటరీ ప్రతిరోజు ఉదయం తనిఖీలకు రావడం లేదు అని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వార్డ్ ఎనర్జీ సెక్రటరీస్ కి షోకాజ్ నోటీసులు జారీ చేయమని ఆదేశించారు. అనంతరం స్థానిక వెంగళరావు నగర్ లోని అన్న క్యాంటీన్ కమిషనర్ సందర్శించి ప్రజలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి నిర్వాహకులకు వివిధ సూచనలు కమిషనర్ జారీ చేశారు.అదేవిధంగా స్థానిక డివిజన్ పరిధిలోని అన్ని డ్రైనేజీ కాలువలలో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు నిరంతరం జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. వీధి దీపాల సమస్య లేకుండా ప్రతి విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ఎక్కువ వెలుగులు ఇచ్చే హై మాక్స్ లైట్లు అమర్చాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చేన్నుడు, రెవెన్యూ అధికారి ఇ నాయతుల్లా,ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు,స్థానిక నాయకులు హజరత్ నాయుడు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 1309 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 65.678 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 2800, కండలేరు వరద కాలువకు 200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.873మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కార్మికులను గుర్తించడంలో అధికారులు ముఖ్య పాత్ర పోషించాలి : జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్



**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాత వార్త, కలెక్టరేట్** ఈనెల 9న వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులకు వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై అవగాహన కొరకు సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు శ్యామ్, గంటా ప్రియాంక ఆధ్వర్యంలో కార్యశాల (వర్క్ షాప్) నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వెట్టి చాకిరి నిర్మూలన చట్టాలపై అవగాహన అవశ్యమన్నారు. కనీస వేతనం చెల్లించకపోవడమే కాకుండా శారీరక శ్రమను దోచుకోవడం, ఆర్థిక స్వేచ్ఛను హరించడం కూడా వెట్టిచాకిరీ కిందకు వస్తాయన్నారు. వెట్టి చాకిరి వ్యవస్థలోని కార్మికులను గుర్తించడంలో అధికారులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణ జిల్లా స్థాయిలో పొంది, తదనంతరం డివిజనల్ స్థాయిలో, మండల స్థాయిలోని అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. కేసులను గుర్తించడం తదుపరి తీసుకోవలసిన చర్యలు గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. వెట్టి చాకిరి కార్మికులను గుర్తించి వారికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. చట్టప్రకారం సంబంధిత యాజమాన్యాలపై చర్యలుంటాయన్నారు. రెవిన్యూ, పోలీస్, లేబర్, విద్యా, వైద్య ఇతర శాఖల సమన్వయ కృషితోనే వెట్టిచాకరీ వ్యవస్థ నిర్మూలన సాధ్యపడుతుందన్నారు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి గంటా ప్రియాంక వెట్టి చాకిరీ కార్మికులను గుర్తించే విధానాన్ని పి పి టి ద్వారా సోదాహరణం గా వివరించారు. అధికారులు నిర్వహించే తనిఖీలు ఎంతోమంది అభాగ్యుల జీవిత తలరాతలను మారుస్తుందన్నారు. అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ ప్రతినిధి షేక్ బషీర్, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్వో సుజాత, డిఆర్డిఏ, హౌసింగ్ పీడీలు నాగరాజు కుమారి, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు

### రైతులు సూచించిన సమస్యల పరిష్కారానికి కృషి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు జాయింట్ కలెక్టర్ కె కార్తీక్




**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త కలెక్టరేట్** జిల్లాలో వరి పంట కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి రైతుకు కూడా మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ చెప్పారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై రైతు సంఘాల నాయకులు, రైతులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని విన్నవించారు. ప్రధానంగా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పించాలని, రైతుసేవా కేంద్రాల్లోనే తేమ శాతం నిర్ధారించి, ఆ ధాన్యాన్ని మిల్లర్లు తీసుకునేలా చూడాలని, లోడిరగ్ సమయంలో ఎక్కువసేపు వేచి వుండకుండా చూడాలని కోరారు. ధాన్యం డబ్బులను కూడా ప్రభుత్వం ఆలస్యం లేకుండా వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం హమాలీ, రవాణా ఖర్చులను రైతులకు చెల్లించలేదని, వెంటనే ఆ డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మిల్లర్లు, దళారులు ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేసే చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కోతల సమయంలో గన్నీ బ్యాగులు అందుబాటులో వుంచాలని విన్నవించారు. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు మొబైల్ డయ్యర్లను సమకూరిస్తే రైతుకు ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సూచించిన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడ్తామన్నారు. ప్రతి గింజను కూడా మద్దతు ధర కంటే తక్కువ కాకుండా కొనుగోలు చేయించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి ధాన్యం ధరలను పర్యవేక్షిస్తారన్నారు. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని చర్యలు చేపట్టామన్నారు. తేమ శాతాన్ని కూడా రైతు సేవా కేంద్రాల్లోనే నిర్ధారించి మిల్లర్లు కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. గన్నీ బ్యాగులు సరిపడ అందు బాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా మద్దతు ధరకే ధాన్యం అమ్ము కునేలా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, సివిల్ సప్లయిస్ డిఎం లక్ష్మి నరసింహారావు, రైతు సంఘ నాయ కులు కోటిరెడ్డి, మల్లారెడ్డి, రాధాకృష్ణమనాయుడు, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## జెసితో భేటి అయిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

### రైతు సమస్యలను పరిష్కరించాలని వినతి
### సహకార సొసైటి సిబ్బందికి పాత బకాయిలు చెల్లించాలి
### అన్నదాలకు గిట్టుబాటు ధర దక్కేలా చొరవ తీసుకోండి



**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త కలెక్టరేట్** కోవూరు నియోజకవర్గం రైతు సమస్యల పై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో సమావేశం అయ్యారు. ప్రభుత్వం వరి రైతులకు ప్రకటించిన గిట్టుబాటు ధర కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాలలో ద్వారా జరిపే ధాన్యం కొనుగోళ్లలో కీలక పాత్ర పోషించే సహకార సొసైటీ సిబ్బందికి చెల్లించాల్సిన కమీషన్ల తాలూకు బకాయిలు చెల్లించాలని ఆమె జాయింట్ కలెక్టర్ కార్తీక్ దృష్టికి తెచ్చారు. డెల్టా ప్రాంతమైన కోవూరు ప్రాంతంలో ఫిబ్రవరి రెండో వారం నుంచి వరి కోతలు మొదలవుతున్న నేపథ్యంలో రైతులకు ఖాళీ గోతాములు, హమాలీల కొరత రాకుండా చూడాలన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి ఎటువంటి అవాంతరాలు లేకుండా అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, నియోజక పరిధిలోని రైతు నాయకులు మరియు నీటి సంఘ నాయకులు అత్తిపల్లి శివారెడ్డి, ఆదాల శివారెడ్డి, నెల్లూరు రమణారెడ్డి, మందపాటి రమణారెడ్డి, బత్తుల హరికృష్ణ, పాశం శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవు : ఎమ్మెల్యే



**బుచ్చి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆకస్మికంగా తనిఖీచేశారు.మొదట హాస్పటల్ అటెండెన్స్ పరిశీలించారు.హాస్పటల్‌లో రోగులకు అందుతున్న సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె డాక్టర్లకు పలు సూచనలు చేశారు .ప్రాణాపాయ పరిస్థితులలో అత్యవసర వైద్యసేవల కోసం వచ్చే రోగుల సౌకర్యార్థం నైట్‌షిఫ్ట్‌లో తప్పనిసరిగా డాక్టర్ల పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అసం పూర్తిగా ఉన్న అదనపు బ్లాక్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గుండె పోటుతో బాధపడుతు హాస్పటల్‌లో చికిత్స చేయించుకుంటున్న బుచ్చి 3 వ సచివాలయ విఆర్ఓ బట్టు సుధాకర్‌ని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పరామర్శించారు. సిబ్బంది కొరత విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజా, బుచ్చి మున్సిఫల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళీ, టిడిపినాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, బుచ్చి మండల పార్టీ అధ్యక్షులు ఎం.వి శేషయ్య తదితరులున్నారు.

## రాష్ట్రం మళ్లి ప్రజా పాలన ప్రారంభం : ఎమ్మెల్యే



**వెంకటాచలం, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో మళ్లి ప్రజల పాలన ప్రారంభమైనది అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.మండల పరిది లోని ఎగువ మెట్టు గ్రామంలో 25 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును సోమిరెడ్డి ప్రారంభించారు.ఎస్సీ, ఎస్టీ,బీసీలకు సబ్సిడీపై స్వయం ఉపాధి రుణాల పంపిణీ తిరిగి అమలులోకి వచ్చింది 2014-19 మధ్య అమలు చేసిన పథకాలన్నీ ఐదేళ్ల తర్వాత మళ్లీ అమలుకాబోతున్నాయి.రీసర్వే పేరుతో రైతుల భూ రికార్డులను ఇష్టారాజ్యంగా మార్చేశారు. వైసీపీ నాయకులు చెప్పిన పేర్లను రికార్డుల్లో ఎక్కించేశారు..విస్తీర్ణాల నమోదులోనూ అన్నీ తప్పులే.ఇడిమెపల్లి సచివాలయాన్ని సోమిరెడ్డి తనిఖీ చేశారు సిబ్బంది హాజరు కాకపో వడంతో వల్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సచివలయం సిబ్బంది అందుబాటు లో ఉండి ప్రజలకు సేవలను అందజేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కల్పన డిటి విజయ్ నాయకులు ముక్కు చంద్ర, రామ్ బాబు,మునిస్వామి,రాజేష్ మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## బెదిరింపులతో గెలుపు గెలుపే కాదు : మా నాయకులు కాకాణి, ప్రసన్నను విమర్శించే అర్హత నీకు లేదు కార్పోరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్




**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** ఇటీవల ఎన్ఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన డిప్యూటి మేయర్ ఎన్నికలో బెదిరించి, ప్రలోభపెట్టి గెలవడం గెలుపే కాదని, దమ్ముంటే ప్రజాక్షేత్రంలో గెలవాలని 37వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పోరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ అన్నారు. గురువారం నగరంలోని డైకస్‌రోడ్డులోని వైస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పలువురు కార్పోరేటర్లు, పార్టీ నాయకులతో కలసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అవగాహన లేకుండా మాట్లాడిన డిప్యూటి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మా నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నాలెడ్జ్ లేదని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలను గురించి తెలుసుకుని మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. డిప్యూటి మేయర్ ఎన్నిక సమయంలో వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేయడం జరిగిందని ఎవరైతే పార్టీకి వ్యతిరేకంగా ఓటేశారో వారందరికి అనర్హత వేటు తప్పదన్నారు. ఈవిషయంతో భయపడి అర్ధరాత్రి సమయంలో జాయింట్ కలెక్టర్‌ను కలసి తామంతా పార్టీకి రాజీనామా చేస్తున్నామని ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. డిప్యూటి మేయర్ ఎన్నికలో టీడీపీ బీఫారం ఇచ్చే సాహసం కూడా చేయలేకపోయిందని.. చివరకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా డిప్యూటి మేయర్‌ను ప్రకటించుకున్నారని ఇంతకంటే దౌర్భాగ్యం మరోకొటి ఉంటుందా అని ఎద్దేవా చేశారు. డిప్యూటి మేయర్ ఎన్నిక సమయంలో విలువలు లేకుండా వ్యవహరించిన నీవు విలువలు గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్న విషయం రూప్‌కుమార్ యాదవ్ తెలుసుకోవాలని సూచించారు. విలువలు పాటించాలని మీనాయకుడు మంత్రి లోకేష్ ఓవైపు చెబుతుంటే మీరెందుకు విలువలు పాటించరని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో రూప్‌కుమార్‌యాదవ్ నాపై చేసిన దౌర్జన్యానికి భయపడి పారిపోతానని అనుకుంటున్నావేమో అలాంటి వాడిని కాదని, కాలేజీలో నుంచే రాజకీయాలు చేసిన వాడిని నీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని బొబ్బల స్పష్టం చేశారు. తాము అనుకుంటే వైఎస్సార్‌సీపీలో ఉన్న కార్పోరేటర్లందరూ టీడీపీలోకి వచ్చేస్తారని దీంతో అక్కడ ఎవ్వరూ మిగలరని ప్రగల్భాలు పలుకుతున్నారని వారందరికి ఒకే సమాధానం చెబుతున్నా అంటూ.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో ఉన్న కార్పోరేటర్లందరూ పార్టీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఉన్నవారేనని వీరిలో ఏ ఒక్కరూ పార్టీ మారేప్రసక్తే లేదన్న విషయం గుర్తుంచుకోవలన్నారు. మాట్లాడేమందు ఎవరిది ఏ స్థాయి అనేది ఆలోచించుకుని మాట్లాడాలని మా నాయకులు కాకాణిగోవర్ధన్‌రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను విమర్శించే స్థాయి నీకుందా రూప్‌కుమార్ యాదవ్ అని ప్రశ్నించారు. ప్రసన్న కుమార్‌రెడ్డి నిజాయితీగా తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరి తిరిగి ప్రజాక్షేత్రంలో గెలిచారన్నారు. అలాగే ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖం రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయితీగా గెలవడం జరిగిందే కాని మీలాగా ఈవీఎంల ద్వారా గెలవలేదనే విషయాన్ని గుర్తుపెట్టుకోండని హితవు పలికారు. ఈ సమావేశంలో కార్పోరేటర్ సత్తార్, మాజీ కార్పోరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్), ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు జాకీర్, శ్యాంసింగ్, ముజాఫర్, మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరుకూరుకి ఆదాల పరామర్శ

**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి గురువారం చెరుకూరు మధు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల చెరుకూరు మధు కుమారుడు సుబ్రహ్మణ్యం కాలం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిసుబ్రహ్మణ్యం ఉత్తరక్రియలకు హాజరై ఆయన తండ్రి చెరుకూరి మధును పరామర్శించి తన ప్రగాఢ సాను భూ తిని వ్యక్తం చేశారు. మధును పరామ ర్శించిన వారిలో నెల్లూరు విజయ డైయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, మాజీ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ హరిబాబు యాదవ్, జడ్పిటిసి సభ్యులు మల్లు సుధాకర్ రెడ్డి, వైసీపీ మహిళా నాయకురాలు కల్లూరు లక్ష్మిరెడ్డి, మాజీ ఏయంసీ డైరెక్టర్ స్వర్ణ జీవన్ ప్రసాద్, వైఎస్ఆర్ సీపీ నాయకులు కొండేటి నరసింహారావు, మైపాడు అల్లా బక్షు, షేక్ మొయిండ్దీన్, బెల్లంకొండ వెంకయ్య, నాని, షేక్ సాజిద్ తదితరులు ఉన్నారు.



## చింతోపు గ్రామ పంచాయతీ బాధ్యతలు ఉప సర్పంచుకు అప్పగింత

**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** నెల్లూరు జిల్లా టీపీ గూడూరు మండలం చింతోపు గ్రామ పంచాయితీ సర్పంచ్, లేబురు మల్లికార్జున, గత రెండు మాసాలుగా గ్రామంలో అందుబాటులోకి, లేకపోవడంతో సర్పంచ్ బాధ్యత లు ఉపసర్పంచ్ కి అప్పగిస్తూ అన్ని రకమైన నిధులు డ్రా చేసే అధికారం కూడా ఉప సర్పంచ్కి అప్పగిస్తూ గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఎల్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు



## ధాన్యం రైతులకు మద్దతు ధర కల్పించాలి

**నెల్లూరు, ఫిబ్రవరి6,ప్రభాతవార్త– కలెక్టరేట్ :** కోవూరు నియోజకవర్గంలో ధాన్యం రైతులకు మద్దతు ధర కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్కు కోవూరు శాసన సభ్యులు ప్రశాంత్ రెడ్డి రిప్రజెంటేషన్ ఇవ్వడం అభినందనీయమని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ తెలిపారు. నెల్లూరు జిల్లాలో మద్దతు ధర కోల్పోయి రైతాంగం ధాన్యాన్ని విక్రయించు కొంటున్న తరుణంలో అధికారులు ఆలస్యంగా నైనా మేల్కొని రైతుల సమస్యలు తెలుసుకునేందుకు సమావేశాలు ప్రారంభించారు. ఇది శుభ సూచకంగా భావిస్తున్నాం అని కనీస మద్దతు ధర 19750 ఉండగా నేడు ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న 300 రైతు సేవా కేంద్రాలలో తేమతో సంబంధం లేకుండా రైతు నష్టపోకుండా కొనుగోలు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. వాతావరణం లో వచ్చే మార్పులు వలన ధాన్యంలో వచ్చే తేమ శాతం వేడికి విరుగుడు లకు రైతులను బాధ్యులు చేయడం సరికాదు తేమశాతం 17 వరకు పరిగణనలోనికి తీసుకుంటున్నారు . తేమ శాతాన్ని 22 శాతం వరకు మినహాయింపు ఇవ్వాలని తద్వారా ఏ రైతు నష్టపోదని అందుకు తగిన విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మిడతల రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు గతంలో నెల్లూరు జిల్లా రైతుల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకున్న అధికారులు విధివిధానాలతో సంబంధం లేకుండా రైతులను నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు సమావేశాలకు పరిమితం కాకుండా అంతిమంగా రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రమేష్ కోరారు.



## ప్రజా వైద్యుడు మృతి

**అల్లూరు,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ప్రజా వైద్యుడు మొగిలి వెంకటసుబ్బయ్య 84 అల్లూరులో గురువారం మృతి చెందారు గతంలో వెంకటసుబ్బయ్య రైల్వే కాంపౌండర్ గా పనిచేసి మధ్యలోనే ఉద్యోగన్ని వదిలేసి ఆయన స్వగ్రామైన అల్లూరు మండలంలోని ఇందుపూరు లో ప్రజా వైద్యునిగా ప్రధమ చికిత్స సేవలు చేసేవారు చుట్టుపక్కల గ్రామాలైన మోపూరు పురిని లో ఇంటింటికి సైకిల్ మీద వెళ్లి వైద్య సేవలు అందించేవారు అల్లూరులో యోగాను సైతం పలువురికి నేర్పించారు హిందూ ధర్మ ప్రచారంలో చురుగ్గా పాల్గొనే వారు యోగాలో ఆయన శిష్యుడైన విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు సైతం ఆయన మృతికి నివాళులర్పించారు ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు ఆయన కుమారుడు మొగిలి దయాకర్ ఆర్ఎంపీ డాక్టర్ గా అల్లూరులో వైద్య సేవలు అందిస్తున్నారు పలువురు ఆర్ఎంపి వైద్యులు సన్నిహితులు కుటుంబ సభ్యులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియలు నిర్వహించారు .



## అభివృద్ధిని చేసిచూపిస్తున్న ఎంఎల్ఏ కాకర్ల

**జలదంకి,ఫిబ్రవరి6,ప్రభాతవార్తః** ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అభివృద్ధిని చేసి చూపిస్తున్నారని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పులిగుంట మధు మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పూనూరు భాస్క రెడ్డిలు పేర్కొన్నారు. జలదంకి మండలం అన్నవ రం గిరిజన కాలనీ లో సిసిరోడ్ల పనులకు గురువా రం వారు శంకుస్థాపన చేశారు.ఎన్నికల ప్రచారంలో భాగంగ ఎంఎల్ఏ సతీ మణి కాకర్ల ప్రవీణ కాలనీకి వచ్చిన సందర్బంలో కాలనీవాసులు రోడ్లదుస్తితిని గూర్చి ఆమెకు ఏకరువుపెట్టా రు.దీంతో సురేష్ ఎంఎల్ఏగ ఎన్నికైన అనంతరం తప్పక సిసిరోడ్ల నిర్మాణం చేపడతామని వారికి హామీ ఇచ్చిన విషయాన్ని నాయకులు ఈసందర్బంగ గుర్తుచేసి అందులో భాగమే గిరిజన కాలనీలో రోడ్లని తెలియ జేశారు.త్రాగునీటి వసతితోపాటు అందరికి పక్కాఇళ్ళనిర్మాణాలుకూడా చేపట్టేందుకు ఎంఎల్ఏ సురేష్ కృత నిశ్చయంతో వున్నారని ప్రజాసేవే పరమావధిగ ముందుకు పోతు ప్రజల మనిషిగ కొనియాడబడుతున్నారని వారు పేర్కొన్నారు.మాశాసనసభ్యుడు ఆదేశాలమేరకు పనులు పక్కాగ చేపడుతు న్నామని వారు ఈ సందర్బంగ స్పష్టంచేశారు.ఈకార్యక్రమంలో టిడిపి అన్నవరం గ్రామకమిటి అధ్యక్షుడు చైతన్యరెడ్డి, మండల ఎస్సిసెల్ అద్యక్షుడు వేల్పుల వేణుగోపాల్,మాజి ఎంపిటిసి సభ్యుడు గోపి తదితరులు పాల్గొన్నారు.



## లోకస్ యాప్పై పొదుపు సిబ్బందికి శిక్షణ

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోనే స్త్రీ శక్తి భవన్లో గురువారం ఆరు మండలాల పొదుపు సిబ్బందికి శిక్షణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పొదుపు సంఘాలు సంఘబంధాలు జరిగే ఆర్థిక లావాదేవీలుపై శిక్షణ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా పొదుపు సంఘాలకు సంబంధించిన సమావేశాలు, ఆర్థిక లావాదేవీలు ఇక నుంచి లోకస్ యాప్ ద్వారా మాత్రమే నిర్వహించేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆరు మండలాల సీసీలు, సీఓలు వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



## శిధిలావస్థలో ఉన్న స్తంభాన్ని తీసికొత్త స్తంభం ఏర్పాటు

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని గురువారం విద్యుత్ అధికారులు బోయ వీధిలో శిధిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తస్తంభం ఏర్పాటుచేశారు. దీంతో బోయవీది కాలనీ వాసులు విద్యుత్శాఖఅధికారులకు అభినందనలు తెలిపారు. దీంతో అక్కడ పొంచి ఉన్న ప్రమాదం తప్పిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.



## ఉర్దూ పాటవాలను విలీనం చేయవద్దంటూ చైర్మన్ బాబుకు వినతి

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని షబ్బీర్ కాలనీలో ఉన్న ఉర్దూ పాఠశాలను సమీపంలోని ఎన్బీ ప్రాథమిక పా ఠశాలలో కలుపవద్దంటూ షబ్బీర్ కాలనీలోని విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇప్పుడున్న ఉర్దూ పాఠశాల ఎన్బీ పాఠశాలకు దూరం గా ఉండటంతో ఆడ పిల్లలు చిన్న పిల్లలు రావడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తల్లిదండ్రులు ఆవదన వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రులు చైర్మన్ గాజులు బాబుకు వినతిపత్రం అందజేశారు.



## క్రీడలకు అనుమతులు ఇవ్వాలి

**విడవలూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** వావిళ్ళ హై స్కూల్కి సంబంధించి క్రీడా మైదానాల్లో స్థానిక క్రీడాకారులకు ప్రభుత్వం సమయ వేళలను మార్పులు రద్దు చేసిన జీవోను విడుదల చేయడం తద్వారా క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని జనసేన మండల అధ్యక్షులు కమతం శ్రీనాథ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన జీవోను ఏర్పాటు చేసి సమయ వేళలను మార్పులు పున: చేసి క్రీడాకారులకు క్రీడ మైదానాల్లో అనుమతులు ఇవ్వాలని కోరారు. గ్రామంలో ఎంతోమంది క్రీడాకారులు ఆటలు ఆడుకునేందుకు మైదానం ఒకవోటే ఉన్నందువలన విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా స్కూల్ సమయాన్ని మినహాయించి నూతన జీవోను విడుదల చేయాలన్నారు. గ్రామంలో ప్రజలు షుగర్, బిపి, వివిధ రకాల వ్యాధులకు గురయ్యారు అలాంటి వారు ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయాన్నే జాగింగ్, వాకింగ్, వ్యాసనాలు తప్పనిసరిగా చేయాలని వైద్యులు చెబుతున్నారు.హై స్కూల్ పరిధిలో ఉన్న మైదానము ప్రజలకు, క్రీడాకారులకు అందుబాటులో ఉంచాలని కోరారు.

## ఉదయగిరిరోడ్డు ఫ్లైఓవర్ మరమ్మత్తులతో ద్విచక్రవాహనాలు దారిమళ్లింపు వివిధసంఘాల బాధ్యురాలు సి.శారద

**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** కావలి పట్టణ ఉదయగిరిరోడ్డు ఫ్లైఓవర్ మరమ్మత్తులు పూర్తయ్యేదాక వైకుంఠపురం రైలుపట్టాలక్రింది మార్గంద్వారా టూవీలర్లను మళ్లించాలని వుమెన్ఫోర్స్ కన్వీనర్ వివిధ సంఘాల బాధ్యురాలు విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలికొండ శారద డిమాండ్ చేశారు. కావలిపట్టణ తూర్పు, పడమరల రాకపోకలుజరిగే ఒకేఒక్కదారి ఉదయగిరిరోడ్డులోని ఫ్లైఓవర్బ్రిడ్జి అని తెలిపారు. ఇటీవల కొన్నిరోజులుగా ఫ్లైఓవర్మీద మరమ్మత్తులు, కొత్తరోడ్డు నిర్మాణం జరుగుతున్నందున వాహనాలను ఒన్వేలో పోనిస్తున్నారన్నారు. ఒక్కోవైపు వాహనాలను పంపేటపుడు కనీసం పదినిముషాలనుండి ఇరువై నిముషాలవరకు ట్రాఫిక్ ఆగిపోతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణపనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియదని తెలిపారు. మార్చిమాసంనుండి 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. పరీక్షాకేంద్రాలకు చేరుకోవడం ఒక్కనిముషం ఆలశ్యమైనా అనుమతించరన్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్డుమరమ్మత్తులు పూర్తయ్యేదాక ద్విచక్రవాహనాలను కళుగోళమ్మగుడి రైల్వేలైన్ కిందిమార్గం ద్వారా రాకపోకలు సాగించేలా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక ఆదేశాలివ్వాలని ఆమె కోరారు.

## బుర్రాని కలిసిన వేణుగోపాల్

**లింగసముద్రం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం అనుబంధ విభాగం వైఎస్సా ర్టీయూసీ అధ్యక్షులు మట్టే వేణుగోపాల్ యాద వ్ను నియమించారు. ఈసందర్భంగా ఆయన గురువారం కందుకూరు వైసీపీ ఇన్ఛార్జీ మధుసూదన్యాదవ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పార్టీ అధ్యక్షులు జగన్మో హన్రెడ్డికి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధ న్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. లింగసముద్రం మండలం నుంచి తన సేవలను గుర్తించి నియోజకవర్గం విభాగం వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులుగా నియమించేందుకు సహకరించిన ఎంపీపీ పెన్నా కృష్ణయ్యకు, జిల్లా విభాగం అధ్యక్షులు పిచ్చపాటి తిరుపతిరెడ్డికి, జడ్పీటీసీ సభ్యులు డాక్టర్ చెన్ను నళిని పద్మ, మండల పార్టీ అధ్యక్షులు నోటి వెంకటేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో వైసీపీ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.



## పీఎం సూర్యఘర్పై విస్తృత ప్రచారం చేపట్టాలి

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలో గురువారం ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై విద్యుత్ అధికారులు డివిజన్ పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ అధికారి విజయన్ తెలిపారు. గురు వారం ఆయన ఉదయగిరి పట్టణంలోని అన్న పూర్ణ కాంప్లెక్స్లో ఉన్న విద్యుత్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డీఈ ఐ.శ్రీనివాసులు, ఏడీఏ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



## పుల్లాయిపల్లి విద్యార్థులకు మెడల్స్ అందజేత

**ఉదయగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పుల్లాయపల్లి మం డల ప్రజా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హె డ్మాస్టర్ గాజులపల్లి సుబ్బారెడ్డి మెడల్స్ అంద జేశారు. మా ట్లాడుతూ సమ్మిట్ అసెస్మెంట (ఎస్ఏ)-1 పరీక్షల్లో మొదటి, ద్వితీయ, తృతీ యఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ను అందజేసినట్లు తెలిపారు. విద్య పట్ల విద్యార్థులను ఈ వయసులో నుండే ప్రోత్సహిస్తే భవిష్యత్తు వారిదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఆదిలక్ష్మీదేవి, ఎస్.ప్రశాంత్ కుమారి పాల్గొన్నారు.



## పలు రకాల కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఎంపీడీఓ కార్యాలయం నందు గురువారం నుండి పలురకాలకార్పొరే షన్ల సబ్సి డీ రుణాలకు దరఖాస్తు ఆహ్వా నిస్తున్నట్లు ఉదయగిరి ఎంపీడీఓ అప్పాజీ జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అలేఖ్య తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బీసీ 30, కాపు 5, ఈడబ్ల్యూఎస్ 9, జనరిక్ మెడికల్ షాపు 1 రుణాలు మంజూరయ్యాయన్నారు. మండలంలో అర్హులైన లబ్దిదారులు 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



## సీనియర్ అధ్యాపకుడు గుండెపోటుతో మృతి

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పరిసర ప్రాంతాల్లో పలు కళాశాలలో పని చేసిన సీనియర్ అధ్యాఫకుడు బి.శ్రావణ్ కుమార్ ప్రస్తుతం ఓ ప్రైవేటు కళాశాల ప్రిన్సిపల్గా వ్యవహారిస్తున్నారు. గత రాత్రి దాసరి పల్లిలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు.రాత్రి భోజనం తర్వాత ఛాతిలోనొప్పి రావడంతో ఉదయగిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షిం చారు. మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.



## మద్యానికి మనవడు - తాత ఊపిరి తీశాడు...

**నెల్లూరు క్రైం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మద్యానికి బానిసైన ఓ మనవడు తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని తాత ఊపిరి తీశాడు. వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన పై పోలీసులు తెలిపిన సమాచారం మేరకు స్థానిక బుజబుజ నెల్లూరు రాజుల వీధికి చెందిన కృష్ణమూర్తి( 69) తన చిన్న కుమార్తె గీత ఇంట్లో ఉంటున్నాడు. గీత దంపతుల పెద్ద కుమారుడు అనిల్ సాయి మద్యానికి బానిసై డబ్బులు కోసం ఇంట్లో వాళ్ళని తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన తాత కృష్ణమూర్తిని మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వమని అడగగా తన వద్ద లేవని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన అనిల్ సాయి ఇంటి బయట వీధిలో నిలబడి ఉన్న తన తాతపై వెనక నుండి దాడి చేశాడు. రోడ్డుపై పడిపోయిన కృష్ణమూర్తికి తీవ్ర గాయాల య్యాయి. వెంటనే ఆయన కుమార్తె గీత, చిన్న కుమారుడు భాస్కర్ సాయి అతన్ని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. నెల్లూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కృష్ణమూర్తి గురువారం మరణించారు.ఆయన కుమారు డు రవికుమార్ ఫిర్యాదుమేరకు వేదయపాలెం సీఐ శ్రీనివాసరెడ్డి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## సిసి రోడ్లు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాక

**కొడవలూరు (విడవలూరు), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నూతన సిమెంట్ రోడ్లు ప్రారంభోత్సవం, షాది మంజిల్ తనిఖీలు కార్యక్రమానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రానున్నట్లు మండల ఇంచార్జ్ ముంగమూరు శ్రీహరి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.మండల నాయకులు కేతు వెంకటరమణారెడ్డి భూలోక విజయ్ కుమార్,నీటి సంఘం అధ్యక్షులు నక్క రమణయ్య, కోవూరు వెంకీ, దాసరి పవన్ కుమార్, కాకాని మురళీకృష్ణ, చింతా ప్రభాస్ పాల్గొన్నారు.



## బ్రహ్మదేవంలో ఉచిత దంత వైద్య పరీక్ష శిభిరం

**ముత్తుకూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** బ్రహ్మదేవం గ్రామంలో నారాయణ దంత వైద్య శాల బ్రహ్మదేవం పంచాయతీ మాజీ సర్పంచ్ క్రొత్తపల్లి రమేష్ కుమార్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య పరీక్ష శిబిరం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ దంత వైద్య ఆసుపత్రి సిబ్బంది, బ్రహ్మదేవం టీడీపి నాయకులు క్రొత్తపల్లి రమేష్ కుమార్, బొబ్బేపల్లి అంకయ్య, కలికి మధుసూదన్ రెడ్డి, చింతా సుబ్బారామిరెడ్డి, దువ్వూరు ప్రభాకర్ రెడ్డి, మారుబోయిన వెంకటరమణయ్య, పసుపులేటి లక్ష్మి ప్రసాద్, గోలి రాము, బద్రి, నెట్టాంబాక రాంమోహన్, మారుబోయిన గోపాలయ్య. మారుబోయిన ప్రసాద్, ఉప్పల ప్రసాద్, మేకల పెంచలయ్య, మారుబోయిన రవి షేక్ అబ్దుల ఖాదర్, మారుబోయిన జయరామయ్య, వలిపి వెంకటేశ్వర్లు, మంగపతి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. శిబిరం లో ప్రజలకు ఉచిత దంత పరీక్షలు చేసి పళ్ళు శుభ్రపరచడం, పళ్లకు సిమెంట్ పెట్టడం ఉచితంగా చేసారు.



## గిరిజనుల పాఠశాలను ఎక్కడికి తరలించవద్దు

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** ఉదయగిరి విద్యా వనరుల కేంద్రంలో గురువారం కార్యాలయంలో గిరిజనుల ఆందోళనలు చేపట్టి వినతిపత్రం అందజ శారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నందు తిరుమలపురం గిరిజన కాలనీకి చెందిన గిరిజనులు, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఉదయగిరి విచ్చేసి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తిరుమలాపురం గిరిజన కాలనీ పాఠశాలలోని 3,4,5 తరగతులను దుంప వారిపల్లి పాఠశాలలో విలీనం చేయవద్దని ఆందోళన చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలాపురం గిరిజన కాలనీ పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నెంబరు 117 ఉపసంహరణ ప్రకారం తిరుమలాపురం గిరిజన కాలనీ పాఠశాల నందు 37 మంది విద్యార్థులు ఉన్నప్పటికి 3,4,5 తరగతుల విద్యార్థులను దుంప వారిపల్లి పాటవాల నందు కలుపుట ఎంత వరకు సమంజసమని, గ్రామంలో చాలా మంది గిరిజన పిల్లలు ఉన్నారని దుంపా వారిపల్లి పాఠశాల మూడు కిలోమీటర్ల పైనే ఉందని, ఈ నిర్ణయాన్ని వెనకకు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని ఎంఈఓ-2కి వినతిపత్రం ద్వారా విన్నవించారు.



## మధురిమవరి పంట పొలాలను పరిశీలన - శాస్త్రవేత్త విజయ్ కుమార్

**కొడవలూరు (విడవలూరు) ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** కొడవలూరు మండలంలోని గుండాలమ్మ పాలెం, వెంకన్నపురం గ్రామాలలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త విజయ కుమార్, జిల్లా వనరుల కేంద్రం వ్యవ సాయ అధికారిణి గీతా కుమారిలు మధురిమ వరి పొలాలను గురువారం పరిశీలించారు. గుండా లమ్మ పాలెం గ్రామంలో వరిలో కొత్త వంగడమైన కే ఎన్ ఎం 7715 రకాన్ని పరిశీలించి కాండం తొలుచు పురుగు ఆశించి ఉందని గుర్తించి దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్ పి మందు 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వెంకన్నపురం గ్రామంలో ఆర్ ఎన్ ఆర్ 15048 వరి రకాన్ని కూడా పరిశీలించి మానిపండు తెగులు నివారణకు హెక్సా కొనజోల్ 2 మి.ల్లి ఒక లీటర్ నీటికి లేదా ప్రొపికొనజోల్ 1 మి.ల్లి ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సిహెచ్. శ్రీలక్ష్మి, వి ఏ ఏ కె. విష్ణు ప్రియ,బి. లిఖిత,స్థానిక నాయకులు అమరేందర్ రెడ్డి, రైతులు దేగ మధు తదితరులు పాల్గొన్నారు.



## ఉచితంగా నీటిసరఫరా చేయాలి కమీషనర్ను కలిసిన సిపిఎం నేతలు



**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో అనేకప్రాంతాల్లో నివసించే పేదలకు ఉచితంగా నీటిసరఫరా చేయాలని సిపిఎం నేతలు డిమాండ్చేశారు. గురువారం కావలి మున్సిపల్ కమీషనర్ శ్రావణ్కుమార్ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచల య్య మాట్లాడారు. నీటి పన్నులు కట్టాలని మున్సి పల్ అధికారులు పేదలకు నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. ఇంటిపన్ను, నీటిపన్ను కలిపి ఒకేసారి వేలాదిరూపాయలు వారంరోజుల్లో చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. గతంలో పేదలు నివసించే ప్రాంతాల్లో వీధికుళాయిలు ఉండేవన్నారు. వాటిద్వారా ఉచితంగా పేదలు నీళ్లుతాగేవారన్నారు. ఈ మద్యకాలంలో ఇంటింటికి నీటికుళాయి వేస్తామనిచెప్పి ఉన్న వీధికుళాయిలను తొలగించారన్నారు. ఇప్పుడు పేదల ఇళ్లల్లో ఉన్న కుళాయిలకు వేలరూపాయలు నీటిపన్నులు చెల్లించాలని పేదలకు మున్సిపల్ అధికారులు నోటీసులివ్వడం చాలా అన్యాయమన్నారు. తెల్లరేషన్కార్డు ఉన్న పేదలందరికి ఉచితంగా నీటిసరఫరా చేయాలన్నారు. ఇప్పటికే అధికధరలు, కరెంటుచార్జీలు పెరిగి పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పుడు మున్సిపల్ అధికారులు పేదలపై ఇంటిపన్ను, నీటిపన్ను భారాలు మోపడం సరికాదన్నారు. ప్రభుత్వం పేదలందరికి ఉచితంగా నీటిసరఫరాచేసి ఇంటిపన్ను తగ్గించాలని డిమాండ్ చేశారు. తగ్గించకపోతే ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూధన్రావు, తదితరులు పాల్గొన్నారు.

## దోమల నిర్మూలనకు ఫాగింగ్, కాలువలు శుభ్రం మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్కుమార్

**కావలి, ఫిబ్రవరి06 ప్రభాతవార్త :** కావలి పట్టణ 29వ వార్డు బాపూజీనగర్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం దోమలు విపరీతంగా ఉండడంతో వాటిని ర్మూలనకు ఫాగింగ్ చేస్తున్నామని గురువారం కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్కుమార్ తెలిపారు. 29వ వార్డు అన్నిప్రాంతాల్లో ఫాగింగ్ చేయడం జరిగిందన్నారు. ఇకనుంచి ప్రతిరోజు ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. అదేవిధంగా 12వ వార్డు రామ్మూర్తిపేట పారిశుధ్యవిభాగం వారిచే గ్యాంగ్ వర్క్ చేపట్టి కాలువలతోపాటు పరిసరాలు పరిశు భ్రంచేయడం జరిగిందని తెలిపారు. కాలువల్లో చెత్త,చెదారాలు వేయకుండా ప్రజలు సహకరించాలన్నారు.



## బీసీలకు నామినేటెడ్ పదవులలో 34శాతం రిజర్వేషన్ కేటాయింపుపై తీర్మానం చేయడం హర్షణీయం

- సీఎం నారా చంద్రబాబునాయుడుకి, నారా లోకేష్ బాబుకి, ఇంటూరి నాగేశ్వరరావుకి కృతజ్ఞతలు
- టీడీపీ నెల్లూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి అమ్మనబ్రోలు రమేష్ తెలుగుదేశం

**ఉలవపాడు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** బీసీలకు మొదటి సారి రిజర్వేషన్ ఇచ్చిన ఘనత ఎన్టీఆర్కు దక్కగా, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత నారా చంద్రబాబుది, తాత ఆశయాలు, తండ్రి ఆలోచనలు పుణికి పుచ్చుకున్న నారా లోకేష్బాబు యువగళంలో ఇచ్చిన బీసీలకు 34 శాతం నామినేటెడ్ పదవులు హామీ నెరవేర్చిబీసీల జీవితాల్లో సరికొత్త సువర్ణ అధ్యాయం లిఖించారు. బీసీ లకు 34 శాతం నామినేటెడ్ పదవుల తీర్మానంతో తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అన్న విషయం మరో మారు రుజువైంది. స్థానిక సంస్థల్లో బీసీరిజర్వేషన్లను 34శాతం నుండి 24 శాతానికి కుదించి 16860 మంది బీసీలను రాజ్యాంగ బద్ధ పదవులుకు దూరం చేసిన పాపం వైసీపీది. 139 కులాలకు 56 కార్పొరేషన్లను హడావుడిగా ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధికి ఒక్క రూపాయి నిధి కేటాయించకుండా బీసీలను దగా చేసిన ఘనత వైసీపీది. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మొదలు పెట్టిన బీసీ భవన్లను వైసీపీ అధికారంలోకి వచ్చాక కక్ష పూరితంగా అడ్డుకున్నారు. 5 ఏళ్ల పాలనలో బీసీ భవన్ల నిర్మాణాలను పూర్తి చేయలేకపోయారు. బీసీలను ఓటు బ్యాంకు లా చూడకుండా వారిని రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా గౌరవ ప్రదమైన స్థానాల్లో చూడాలను మంచి ఉద్దేశంతో నారా లోకేష్బాబు బీసీలకు 34 శాతం నామినేటెడ్ పదవుల హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ బీసీలకు 34 శాతం నామినేటెడ్ పదవులు తీర్మాణం చేయించడం నారా లోకేష్బాబు నాయకత్వ పటిమకు నిదర్శనం. ఇదే విధంగా కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బీసీలను నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పదవులకు బీసీలను నామినేట్ చేస్తూ బీసీలకు గొప్ప అవకాశాలు కల్పిస్తున్నటువంటి ఇంటూరి నాగేశ్వరరావుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.



## పదోన్నతి పొందిన అధికారులను సత్కరించిన సంయుక్త సేవాసంస్థ

**కావలిరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి వెంగళరావునగర్‌లోని సంయుక్త నృత్య కళానిలయంనందు సంస్థ సభ్యులు అసిస్టెంట్ బిసివెల్‌ఫేర్ అధికారిగాఎ.సాల్మాన్ రాజాప్రియ, బిసి హాస్టల్ వె ల్‌ఫేర్ అధికారిగా వట్టికాల నరసింహయ్యలు పదోన్నతిపొందిన సందర్భంగా సంస్థన భ్యులందరూ కలిసి గురువారం వారిని దుశ్శాలువాలతో, పూల మాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది. సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అల్పాహార భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కావలి ఇన్‌చార్జి బిసి వెల్‌ఫేర్ అధికారి రవికుమార్ పాల్గొని మాట్లాడారు. తమయొక్క డిపార్ట్‌మెంట్‌నందు పనిచేస్తున్న ఎ.సాల్మాన్‌రాజాప్రియ, వట్టికాలనరసింహయ్యలకు పదోన్నతులురావడం సంతోషంగాఉందని తెలియచేశారు. గుంటూరుకు బదిలీపై వెళ్లిన సాల్మాన్‌రాజాప్రియ రెండునెలలలోపే అక్కడి కలెక్టర్‌చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకోవడం సంతోషంగాఉందని తెలియచేశారు. సన్మానగ్రహీతలు మాట్లాడారు. మమ్ములను ఘనంగా సత్కరించిన సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర కు,సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలియచేశారు. వార్డెన్లు శ్రీకాంత్,చలపతిరావు, నాగేశ్వరి,విజయలక్ష్మి, సంస్థ గౌరవసభ్యులు బుర్లా రఘుకుమార్‌రెడ్డి, ఎం.అజిత్‌బాబు, ఎంవియన్ ప్రసాదరావు, షేక్.ఖాదర్‌బాష,సంయుక్త నృత్యక ళానిలయం నాట్యగురువు లిఖిత, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్లు పంపిణి చేసిన హ్యాపీసేవాసంస్థ

**కావలిరూరల్, ఫిబ్రవరి6 ప్రభాతవార్త**



హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో నిరుపేద దివ్యాంగులకు కావలి వెంగళరావునగర్‌లోని నాగ సాయిబాబా మందిరంనందు శ్రీసాయిలీలామృతం గతవారంరోజులుగా నిర్వహిస్తున్నందున గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్యాంగులకు దుప్పట్లపంపిణి, అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హ్యాపీసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘనీబాష మాట్లాడారు. మంచి మనసు సేవాభావం కలిగిన కొండావెంకటరామిరెడ్డి దాతృత్వంతో మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాగసాయిబాబా ఆలయకమిటీ అధ్యక్షులు, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బాపట్ల గంగయ్య, బి.బాలిరెడ్డి, చేజర్ల మాలకొండారెడ్డి, దాత కొండా వెంకటరామిరెడ్డి, సంస్థ సలహాదారులు చేవూరు ప్రభయ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## విఎస్‌యు క్రీడాపోటీల్లో సత్తాచాటిన కావలి కళాశాల

**కావలిరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



నెల్లూరు క్రాకుటూరునందుగల విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంనందు నిర్వహించిన ఇంటర్‌కాలేజి యేట్‌స్టాఫ్ పురుషులు, మహిళల క్రీడాటోర్నమెంట్ గురువారం ఘనంగా ముగిసింది. ఈ క్రీడా పోటీల్లో వివిధ కళాశాలల అధ్యాపకులు, అధ్యాపకేతరసిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించడం జరిగింది. విక్రమసింహపురి యూనివర్సి టి కావలి కళాశాలకు చెందిన చేవూరు మణికంఠ, బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో విన్నర్స్‌గా నిలవడం జరిగింది. డబుల్స్ విభాగంలో చేవూరు మణికంఠ, సుదీప్‌లు రన్నర్స్‌గా నిలిచారు. టేబుల్‌టెన్నిస్ సింగి ల్స్‌లో చేవూరు మణికంఠ విన్నర్‌గా నిలిచారు. డబుల్స్ విభాగం లో చేవూరు మణికంఠ, సుదీప్‌లు విన్నర్స్‌గా నిలిచారు. టెన్నిస్ సింగిల్స్‌లో చేవూరు మణికంఠ విన్నర్స్‌గా నిలిచారు. వీరిని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర్‌రావు అభినందించి బహుమతులు అందచేయడం జరిగింది.

## విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

**ఉలవపాడు,ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన ఉలవపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో వీరేపల్లి మోడల్ స్కూల్ నందు 8,9,10వ తరగతులలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ఎంపిక చేశారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నిర్మలా కుమారి విద్యార్ధులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు. నేటి విద్యార్ధులే రేపటి బావి పౌరులని వారు చదువులో మంచి ప్రావీణ్యత సాధించి, ఉత్తమ ఫలితాలు అందుకోవాలని కోరారు. అదే విధంగా మన బ్యాంకు వారు విద్యార్థులకు ఉన్నత విద్యా, విదేశీ విద్య కొరకు విరివిగా విద్యా రుణాలు కల్పిస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రగతి విద్యా జ్యోతి, స్కీమ్ ద్వారా ఎం.లాస్య, టి.సాయిలక్ష్మి, జన్యంతి, సీహెచ్ ద్రాక్షయని అను విద్యార్థిలకు ఉపకార వేతనం అందజేయుట జరిగింది. ఈ అవకాశాన్ని విద్యార్థులరూ ఉపయోగించుకోవాల్సిందిగా సూచించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు,బ్యాంకు సిబ్బంది తేజస్విని, శివారెడ్డి,జ్యోతి,సురేష్ పాల్గొన్నారు.

## పిల్లలకు సౌకర్యవంతంగా పాఠశాలను ఉంచాలి

**వింజమూరు, ఫిబ్రవరి6,ప్రభాతవార్త**



మండలం నల్లగొండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చౌటపల్లి ప్రాధమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మీదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సభ్యులు తమ గ్రామంలోని పాఠశాలను మూత వేయకుండా తమ పాఠశాలలోనే 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు సౌకర్యవంతంగా విద్యాబోధన కొనసాగించాలని వినతిపత్రం ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల దూరమైనందున రోడ్డు సమస్యతో ఇబ్బంది కలుగుతుందని డ్రాపౌట్స్‌గా మారే పరిస్థితి ఉందని పాఠశాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు అందజేసిన వినతిపత్రంలో కోరారు. ప్రధానోపాధ్యాయులు డీపీ నర్సింహులు, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బత్తాయి రైతులకు గ్యాప్ పొలంబడిపై శిక్షణ కార్యక్రమం

**వింజమూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



వింజమూరు మండలం రావిపాడు గ్రామంలో బత్తాయి రైతులకు గ్యాప్‌పై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్ర శాస్త్రవేత్త ఏడీఏ సుమతీదేవి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులకు మేలేని శాస్త్ర సాంకేతిక పద్దతులు గ్యాప్ సర్టిఫికేషన్ రసాయనిక అవశేషాలు లేని పంటను తీసుకుని పద్దతులపై వివరించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలుపాటించి మేలైన దిగుబడులను పొందాలన్నారు. అదే విధంగా పొదలకూరు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సురేఖ దేవి మాట్లాడుతూ ట్రైకోడెర్మా విరిడి భూమిలో చల్లు విధానం పప్పు శనగలు ఎండు తెగులు నివారణకు అదుపులో ఉంచుటకు ట్రైకోడెర్మా భూమిలో చల్లడం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ శిలీంద్రమో ఎండు తెగులు కలిగించే కీటకాలపై ఒక పొరలో ఏర్పడే తదుపరి హానికారక సురేంద్రాన్ని అభివీద్ది చెందనికుండా చేస్తుందని పేరు వేప నూనె పిచికారి, అంతర పంటగా ఆవాలు, దనియాలు 8:12 నిష్పత్తిలో వేయడం వలన శనగల్లో పచ్చిపురుగు ఆశించటాన్ని అదుపులో ఉంచివిపరీతమైన విషపూరిత రసాయన పురుగుమందులు వాడకుండా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఏడీఏ ఎన్.రామిరెడ్డి మాట్లాడుతూ ఈ పంట ఈకేవైసీ రైతుల రిజిస్ట్రేషన్ అమలవుతున్న పథకాల గురించి వివరించారు. కావున రైతులు వ్యవసాయ అధికారులు సూచనలను పాటించి తగిన విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీహరి, వీఏఏ ప్రసాద్, ఆ గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

## చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :**




ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి చదవడం, రాయడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎం ఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ తెలి పారు. కోవూరులోని శాంతినగ ర్‌లో ఉన్న ఎన్‌టీవీడీఎం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీలు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## వైకాపా నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా భాస్కర్



**విడవలూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా విడ వలూరు మండలం చౌకచర్ల గ్రామానికి చెందిన అనపల్లి ఉదయభాస్కర్‌ను నియ మితు లైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి నలపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, రజిత్ కుమార్ రెడ్డి, నిరంజన్ బాబు రెడ్డి, వీరి చలపతి రావులకు కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పార్టీ బలోపేతం కోసం నిరంతరం పని చేసి రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం కోసం నడుంబిగించి పనిచేస్తానని తెలియజేశారు.

## కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలి

**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :**




పదవ తరగతి పరీక్షలకు ఇక 35 రోజులు మాత్రమే సమయం ఉందని, వీటిని విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వి. సురేష్‌బాబు తెలి పారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు పునశ్చరణ తరగతులను నిర్వహించారు. మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని సాధించాలనే తపన, ఆశయం ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమను ఏ ఉద్దేశంతో పాఠశాలకు పంపారో ఆ లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ప్రతి ఒక్కరిలో తప్పనిసరి అన్నారు. ఈ 35 రోజుల పాటు సెల్‌ఫోన్, సినిమా, చాటింగ్ రీల్స్ కబుర్లు వంటి వాటికి స్వస్తి పలకాలని సూచించారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు తనకు ఈ సబ్జెట్ అంటే భయం,. ఇవి తనకు రావు అనే వాటిని పూర్తిగా విడనాడాలన్నారు. దేనినైనా సాధించాలనే తపన, పట్టుదల ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ముఖ్యంగా 590 మార్కులు సాధించాలనే పట్టుదల ప్రతి ఒక్కరిలో ఉన్నప్పుడే అద్భుత ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆందోళన, ఒత్తిడి, భయాందోళన వంటి వాటిని విడనాడి ఒక పట్టుదల సాధించాలనే తపనతో పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ప్రతి విద్యార్థి ముందుకు సాగితే ఫలితాలు మీ వెంట పరుగులు తీస్తాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థానంలో ఉన్న ప్రతి ఒక్కరూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే అన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రహీమ్, ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరి, సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్‌లు పలు సూచనలు చేశారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన పంచాయతీరాజ్ డీఈ

**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :**



కోవూరు మండలం పాటూరు గ్రామ పంచాయతీ పరిధిలో 8వ తేది కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిచే పలు ప్రారంభోత్సవ శంకుస్థాపన అభివృద్ధి కార్యక్రమాలను గురువారం పంచాయతీ రాజ్ డీఈ మోహన్‌రావు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన 20.50 లక్షల వ్యయంతో చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, 23 లక్షలతో చేపట్టిన రైతు సేవా కేంద్రం భవనాన్ని అదేవిధంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ ఏఈ పరమేశ్వర లింగం ఉన్నారు.

## మాయమాటలకు బాలికలు మోసపోవద్దు

**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :**



ప్రస్తుతం సమాజంలో మాయ మాటలు చెప్పేవారు ఎక్కువయ్యారని అటువంటి వారు చెప్పే మాటలను బాలికలు గానీ, యువతులు కానీ నమ్మవద్దని ఏహెచ్‌టీవీ ఏఎస్సై వై. శ్రీహరి, సతీష్‌లు తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, మహిళా డీఎస్పీ సీహెచ్ రామారావు ఆదేశాల మేరకు బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఎమెన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కనుక వారికి ఇటువంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా మిమ్మల్ని సినిమా యాక్టర్‌ను చేస్తామంటూ మాయమాటలు చెప్తే వాటిని నమ్మి మోసపోకుండా వెంటనే 112, 1098 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు లోపు ఉన్న బాల బాలికలు అందరూ ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం పాఠశాలలో చదువుకోవాలన్నారు. అట్లు కాక ఎవరైనా పనిలో పెట్టుకుంటే ఆ సమాచారాన్ని కూడా పై ఫోన్ నెంబర్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కొంతమంది వ్యక్తులు మానవ అక్రమ రవాణా అసాంఘిక కార్యక్రమాల్లో దృష్టి సారించి అందుకు బాలికలను, మహిళలను ఒక లక్ష్యంగా పెట్టుకుంటున్నారన్నారు. ఇటువంటి వారి పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా అనుమానం వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాలను ఆకళింపు చేసుకోవాలని ఎవరైనా ప్రేమ వంటి వ్యవహారాలపై దృష్టి సారిస్తే ఈ సమయంలో వారి బతుకే అంధకారం అవుతుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, గీతామాధురి, ఫిజికల్ డైరెక్టర్ దేవికారాణిలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఏ. ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## క్యాంపస్ నియామకాల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :**



కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి పాలిటెక్నిక్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు చెన్నైకు చెందిన కోర్ ఇంజనీరింగ్ సంస్థ వ్యాలీయే ప్రిక్షన్ మెటీరి యల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ నియామకాల్లో విజయఢంకా మోగించారని కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 40 విద్యార్థులు డిప్లమా ట్రైనీగా ఎంపికై తమ కళాశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారన్నారు. డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు బీటెక్‌తో సమానంగా అవకాశాలు ఉన్నాయన్నారు. డిప్లమా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం అభివృద్ధిపై దృష్టికి సారిస్తే ఇటువంటి అవకాశాలు వస్తాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. మహేంద్రబాబు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు డిప్లమా ఇంజనీరింగ్ ట్రైనీకి ఎంపిక కావడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి అనిల్‌కుమార్‌లు పలు సూచనలు చేశారు.ఈ అభినందన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రావణ్‌కుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి వై. దినకర్, తదితరులు ఉన్నారు.

## పట్టాల రీ వెరిఫికేషన్ పారదర్శకంగా చేపట్టాలి

**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :**



కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను 60 శాతం మందికి పైగా ఇళ్లు నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచారని, అటువంటి స్థలాల రీ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామ సర్వేయర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ ఖాళీగా ఉన్న స్థలాలను రీ వెరిఫికేషన్ చేసే సమయంలో అవి అనర్హులు అని తేలితే ఆ సమాచారాన్ని కూడా సర్వే రిపోర్ట్‌లో పొందు పరచాలన్నారు. ఎంపీఐ కింద ఈ రీవెరిఫికే షన్ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్ నాజర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రవి, తదితరులు ఉన్నారు.

## వార్త కు స్పందన ఎటిఎంకు మరమ్మత్తులు

**బిట్రగుంట ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** మండలకేంద్రమైన బోగోలులో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు చెందిన ఎటిఎం పనిచేయడంలేదనే గురువారం ప్రచురితమైన వార్తకు సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. గత 15 రోజులుగా ఎటిఎం పనిచేయకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు గురించి వ్రాయడంతో దీనికి మరమ్మత్తులు చేపట్టారు.

## ప్రతి ఒక్కరూ ఈ పంట నమోదు చేసుకోవాలి

**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :**



ప్రస్తుతం ఈ సీజన్‌లో వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఇంది రావతితెలిపారు. కోవూరు మండలంవేగూరు,లేగుంటపాడు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభం కానున్నాయని, గ్రేడ్-ఏ రకానికి క్వింటాకు 2320, పుట్టికి 19,720 రైతుకు గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రస్తుతం వరిలో అక్కడక్కడ కాండం కుళ్లు తెగులు కనిపిస్తుందని దీనిని గుర్తించిన వెంటనే హెక్సాకొనజోన్ 2 మి.లీ.. లీటర్ నీటికి కలిపి మొదలు మీద పడే లాగా పిచికారి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ వి. రవి శంకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్‌దన్ యోజన, సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వంటి పథకాలను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సుభాషిణి, చైతన్య, వంశీ ఉన్నారు.

## టిడిపి కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**విడవలూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** విడవలూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కలగుంట సుబ్రహ్మణ్యం ఇటీవల అనారోగ్య కారణంతో మృతి చెందాడు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సుబ్రహ్మణ్యం కుటుంబానికి 10 వేలు మండల ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పొన్నలూరు పురంధర్ రెడ్డి చేతుల మీదుగా సుబ్రహ్మణ్యం కుమారుడు వెంకటేష్‌కు అందజేశారు. ఆ కుటుంబానికి టిడిపి నాయకులు అన్ని విధాలుగా అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ కే రఫీ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరా పైప్‌లైన్ లీకేజ్‌ను పరిశీలించిన కమిషనర్

**కావలి, ఫిబ్రవరి6 ప్రభాతవార్త**



కావలి పురపాలకసంఘంపరిధిలోని 30 వవార్డు వై కుంతపురం ప్రాంతంలో ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ ఎదురుగాఉన్న నీటిసరఫరా పైప్‌లైన్ లీకేజ్ అయింది. ఈ విషయం తెలుసుకున్న కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్ కుమార్ గురువారం అక్కడికి వెళ్లారు. లీకేజ్‌ను పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజ్‌ను త్వరితగతితన పూర్తిచేయాలని ఇం జనీరింగ్ విభాగపుసిబ్బందిని ఆదేశించారు.

## ముసునూరులో గోళ్ల బ్రహ్మయ్య ఉరివేసుకుని ఇంట్లో మృతి

**కావలి, ఫిబ్రవరి6 ప్రభాతవార్త**



కావలిరూరల్ మండలం ముసునూరు గ్రామానికి చెందిన గోళ్ల బ్రహ్మయ్య (26) ఇంట్లో ఉరివేసుకుని గురువారం మృతిచెందాడు. మృతుని తండ్రి శీనయ్య రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి సంఘటన ప్రదేశాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. వివరాలు వెల్లడించారు. దాదాపు నాలుగునెలల కిందట పాటూరి రఘు కుమార్తె హాసినిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ నెల 5వ తేది బ్రహ్మయ్య భార్య హాసిని అలిగి ఆమె తల్లి దండ్రుల ఇంటికి వెళ్లారని తెలిపారు. హాసిని ఇంటికి రాకపోయేసరికి ఆయన మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని చనిపోయాడన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ధర్మవరం గ్రామంలో పశువైద్యశిబిరం



**దగదర్తి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** మండలం లోని ధర్మవరం గ్రా మంలో రాష్ట్రీయ గోకుల మి షంలో భాగంగా కోవూరు డీఎల్‌డీఏ వారి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో కొవూరు డీఎల్‌డీఏ డి.శ్రీ నివాస రావు,ఏడీ జి.ప్రసన్నాంజనే యరెడ్డి, ఏడీ ఎస్‌కే రసూల్, ఏడీ మహేశ్వరయ్య, వీఏఎస్ మహేష్ కుమార్, వీఏఎస్ ప్రసాద్‌లు పాల్గొన్నారు. పశుపోషకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గేదెలలో 51 గర్భకోశ వ్యాధులకు, 22 జబ్బు పడిన పశువులకు , 34 నట్టల నివారణ మందులు ఇచ్చారు. రైతులకు పశువులలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పిం చారు. మిని గోకులం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, పీకేసీసీ పంట పథకాల గురించి తెలియజేశారు. రైతులకు పాడి పరిశ్రమ లాభాలు గురించి వివరించారు. గ్రామపెద్దలు, పశుపోషకులు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి



**అనంతసాగరం,ఫిబ్రవరి6,ప్రభాతవార్త:** మండలంలోని సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం మినగల్లు గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులందరూ తప్ప నిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలన్నారు. జిఎస్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం బయోమెట్రిక్ హాజరు ఆధారంగా జీతాల చెల్లింపు చేయాల్సి ఉందని, కావున అందరూ తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలన్నారు. అనంతరం హౌస్‌హోల్డ్ జియో టాకింగ్ , సూక్ష్మ , చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించిన ఎంఎస్ఎంఇ సర్వే త్వరగా పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో ఇంకా మా ్యపింగ్ చేయాల్సిన కుటుంబాలుంటే త్వరగా పూర్తి చేయాలన్నారు.గ్రామ పంచాయతీ నిధులను వినియోగంచుటకు సంబంధించి జిపిడిపి ప్రణాళికలు త్వరగా రూపొందించాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యశాలలో పలువురిని పరామర్శించిన టిడిపి రాష్ట్రకార్యదర్శి "మాలేపాటి"



కావలి, ఫిబ్రవరి6 ప్రభాతవార్త కావలి రూ రల్ మండలానికి చెందిన పలువురు వైద్య శాలల్లో చికిత్స పొందుతుంటే వారిని టిడిపి రాష్ట్రకార్యదర్శి, కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు పరామ ర్శించారు. కావలి రూరల్ మండలం అన్న గారిపాలెం పంచాయితీ వెంకటేశ్వరపాలెం గ్రామస్తులు మామిడి సోంబాబు, మామిడి మాధవిలు యాక్సిడెంట్‌కు గురై నెల్లూరులోని మెడికవర్ వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాలేపాటి గురువారం వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. వారి దయనీయపరిస్థితిని గమనించి వైద్యులతో మాట్లాడారు. మెరుగైనవైద్యం అందేలా ఆరోగ్యశ్రీ వర్తించేలా చేయాలని తెలిపారు. వారి కుటుంబసభ్యులకు నేనున్నానంటూ ధైర్యంచెప్పారు.

**-మన్నంగిదిన్నె మహిళలను పరామర్శించిన మాలేపాటి...** మండలంమన్నంగిదిన్నె గ్రామానికి చెందిన అడపాల వెంకటశేషమ్మ ఆనారోగ్యంతో నెల్లూరులోని సింహపురి వైద్యశాలలో చికిత్సపొందు తున్నారని తెలుసుకుని టిడిపి రాష్ట్రకార్యదర్శి, కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. ఆమె త్వరగా కోలుకునేవిధంగా వైద్యం అందించాలని కుటుంబసభ్యుల సమక్షంలో ఆయన డాక్టర్లను కోరారు.

## ఎమ్మెల్యేసహకారంతో మినగల్లురోడ్డుకి మరమ్మత్తులు



**బుచ్చి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామం ఎన్ఎస్ఆర్ గిరిజన కాలనీ వద్ద నుండి అన్నారెడ్డిపాళెం వరకు సదరన్ ఛానల్ పక్కన వున్న రోడ్డు మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో ఈరోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్లు మినగల్లు సర్పంచ్ బొర్రు పూజిత,టిడిపినాయకులు బొర్రురాము, పంచేడు నాయకులు అమర్‌నాద్‌రెడ్డి,అన్నారెడ్డిపాళెం నాయకులు మెట్టు విజయ కృష్ణారెడ్డి తెలిపారు. రోడ్డుకి ఇరువైపుల మొదట జంగిల్ క్లీరెన్స్ చేస్తున్నామని,రోడ్డుపైన గుంటలు పూడుస్తున్నట్లు తెలిపారు.తరువాత రోడ్డుపైన గ్రావిల్ వేయడం జరుగుతుందని చెప్పారు. మరోసారి ఈరోడ్డు విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్ళి తారు రోడ్డు మంజూరు చేయించేందుకు కృషి చేయనున్నట్లు టిడిపినాయకులు బొర్రు రాము తెలిపారు.ఈరోడ్డు ప్రస్తుతం ఎన్ఎస్ఆర్ గిరిజన కాలనీ వరకు తారురోడ్డు వేసి వున్నారని, అన్నారెడ్డిపాళెం వరకు తారురోడ్డు వేస్తే పాత మినగల్లు నుండి బుచ్చిరెడ్డిపాళెంకి కేవలం 15 నిమిషాలలో రావచ్చునని ఆయన తెలిపారు.గత ప్రభుత్వం సమయంలో ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు.టిడిపి ప్రభుత్వం హయాంలో తప్పకుండా జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## బుచ్చి పట్టణానికి ఫైర్‌స్టేషన్ మంజూరు



**బుచ్చి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీకి ఫైర్‌స్టేషన్ మంజూరు కాగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వైస్ చైర్‌పర్సన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి,ఎమ్మెల్యేవేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శాశ్వత అగ్ని మాపక భవనం కట్టే వరకు వవ్వేరులోని రైతు భరోసా కేంద్రంలో అగ్ని మాపక కేంద్రం నిర్వహించవలసిందిగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంకి ఫైర్‌స్టేషన్ మంజూరు కావడం ఆనందంగా వుందని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షులు ఎంవి శేషయ్య, టిడిపినాయకులు మోర్ల మురళీ ఉన్నారు.

## దామరమడుగు హైస్కూల్ పరిశీలించిన ఎమ్మెల్యే



**బుచ్చి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం దామరమడుగు గ్రామంలోని ఉన్న పాఠశాలలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మధ్యాహ్న బోజనం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. 416 మంది ఉన్న హైస్కూల్‌లో 283 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు తెలియగా ఎమ్మెల్యే ఇంచార్జి హెడ్ మాష్టర్ నరసింహరావును ప్రశ్నించారు. విద్యార్థుల హాజరు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీద లేదా అని ఆమె ప్రశ్నించారు. విద్యార్థులతో కలిసి బోజనం రుచి,శుచి ,నాణ్యతలను పరిశీలించారు. కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల నిర్వహణలో విద్యాకమీటిలు క్రియాశీలకంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్ళాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో బుచ్చి మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కోడూరు కమలాకర్‌రెడ్డి , బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఎంపిడిఒ శ్రీహరిచేజర్ల మహేష్, బెజవాడ జగదీష్, తదితరులున్నారు.

## టీకాలు నిర్ణీత కాలంలో ఇవ్వాలి



**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త-వైద్యం** పుట్టిన ప్రతి బిడ్డకు షెడ్యూల్ ప్రకారం నిర్ణీత కాలంలో 100 శాతం టీకాలు వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వంగల సుజాత సూచించారు. గురువారం నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు టీకాలపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, సెప్టెంబర్ నెలలో టీకాలపై హెడ్ కౌంట్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. గర్భవతులు, 0నుంచి 2 సంవత్సరాలలోని పిల్లలు, 5 ఏళ్లలోని పిల్లలను గుర్తించి ప్రణాళిక ప్రకారం టీకాలు వేయాలని సూచించారు. ఇందుకోసం మార్చి 10వ తేదీ లోపు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ అమరేంద్ర, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్వేలైన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోనికస్టఫ్, అర్బన్ ఫ్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డిఓ అనూషతో గిరిధర్ రెడ్డి భేటీ



**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో నాగ సంతోష అనూషని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గురువారం ఆర్డిఓ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, సీనియర్ టిడిపి నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల విలీనానికి విద్యాశాఖ కసరత్తు



**వలేటివారిపాలెం ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** విద్యార్థులు లేని పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనానికి విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది.దీంతో ఒకే పంచాయతీలో వివిద కాలనీల్లో గల పాఠశాలలను ఒకే పాఠశాలగా విలీనం చేయనున్నారు.ఈ మేరకు సన్నాహాలు ప్రారంభించారు.వివరాల్లోకి వెళితే...గత ప్రభుత్వ హయాంలో జీవో నంబరు 117ద్వారా పాఠశాలల నిర్వహణలో పలు మార్పులు తెచ్చారు. దీనితో ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5తరగతుల విద్యార్థులను,సంబందిత ఉపాధ్యాయులను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేశారు.దీంతో చాలాపాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మండలంలో ఒకరు, ఇద్దరు, 6గురు ఇలా సింగిల్‌డిజిట్ విద్యార్థులుతో పాఠశాలలు నడుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇలా ఉండడంతో పలు ఉపాధ్యాయ సంఘాలు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లారు.దీనితో వాస్తవాలను పరిశీలించిన అనంతరం విద్యాశాఖ పాఠశాలల సంస్కరణల గత జనవరి 9న మెమో విడుదల చేసింది.పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని, డ్రాపవుట్స్‌ను తగ్గించాలని,మనబడి మన భవిష్యత్ కార్యక్రమంలో బాగంగా ప్రభుత్వ పథకాలైన మధ్యాహ్న భోజనపదకం,తల్లికి వందనం,విద్యామిత్ర తదితర పథకాలు సక్రమంగా అందించడానికి విద్యాసంస్కరణలు చేపట్టినట్లు మండల విద్యాశాఖాదికారి మల్లికార్జున తెలి పారు.ఇందులో బాగంగా గ్రామపంచాయతీలోని పాఠశాలలన్నీటిని ఒకే స్కూ లుగా ఏర్పాటు చేయనున్నారు.దీంతో పాఠశాలలను 3 కేటగిరీలుగా విభజించారు.1,2 తరగతులలో 14మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను పౌండేషన్ స్కూలుగానూ,1నుంచి 5 తరగతుల్లో 21మందిలోపు ఉంటే ఆ పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూలుగానూ,1 నుంచి 5తరగతుల్లో 60మంది లేదా ఆ పైన విద్యార్థులుంటే ఆ పాఠశాలలను మోడల్‌ప్రైమరీ పాఠశాలలుగా ఎర్పాటు చేయనున్నారు.పౌండేషన్ స్కూలులో 1 టీచరు, బేసిక్‌ప్రైమరీస్కూలులో ఇద్దరు టీచర్లు, మోడల్ ప్రైమరీలో 5గురు టీచర్లను కేటాయించనున్నారు.అయితే గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఆయా పాఠశాలలతో కలిసి పనిచేయాల్సిందిగా సూచించారు.ఈ ఉత్తర్వులు మేరకు హైస్కూలులోని 3,4,5తర గతుల విద్యార్థులు తిరిగి మోడల్ లేదా బేసిక్ ప్రైమరీస్కూళ్లలోకి రాను న్నా రు.యూపీ స్కూళ్లలోని 6,7తరగతుల విద్యార్థులు సమీపంలోని హైస్కూళ్లకి వెళ్లాల్సి ఉంది.

**ఉత్తర్వుల వలన పలు ఇబ్బందులు:** ఈ ఉత్తర్వులు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.గ్రామాల్లోని ఎస్సీ,బీసీ కాలనీలు ప్రధాన గ్రామంలోని పాఠశాలకు సుదూరంలో ఉన్నాయి. దీంతో ఆ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలంటే రాకపోకలకు ఇబ్బందులు ఎదుర వుతాయని అధికారులకు విజ్ఞప్తిచేస్తున్నారు.పోలినేనిపాలెంలోని ఆది ఆంధ్రకాలనీ పాఠ శాల విద్యార్థులు ఈ మేరకు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వివరించారు .అలాగే కాకర్లపాలెం పాఠశాలలోని 3,4,5తరగతుల పిల్లలు చుండిలోని మోడల్ ప్రైమరీ పాఠశాలకు వెళ్లాలంటే మార్గమద్యంలో వాగు శ్మశానం,జాతీయ రహదారి ఉందని పలువురు వివరిస్తున్నారు.అదేవిదంగా రామచంద్రాపురం, కూనిపాలెం, నూకవరం అంకభూపాలపురం, పెదమ్మపాలెం విద్యార్థులు వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లడానికి ఎదురువుతన్న ఇబ్బందులు వివరిస్తునా రు. అదేవిధంగా కొండసముద్రం 6,7 తరగతుల విద్యార్థులు పోకూరుకు హై స్కూలుకి వెళ్లాల్సి ఉంది.ఈ విషయమై ఎంఈవో మల్లికార్జున మాట్లాడుతూ ఇతరపాఠశాలలోకి వెళ్ళేవిద్యార్థులకు రవాణా చార్జీలుచెల్లించనున్నట్లు తెలిపారు.

## ఘనంగా షిరిడీ సాయినాథునికి పూజలు





**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మంది రంలో మాఘమాన గురువారం పర్వ దినం సందర్భంగా సాయినాథునికి ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చ కలు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించా రు.ఈసందర్భంగాస్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నుల పండువ గా నిర్వహించారు. ఈ కా ర్యక్రమం లో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భ క్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గంగాధర్ సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకం



**కోవూరు,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** కోవూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఆయుర్వేద వైద్యులుగా పనిచేస్తున్న గంగాధర్ సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎం గంగాధర్. తెలిపారు ఆక్వా డెవిల్ అసోసియేషన్ విజయవాడ వారు నిర్వహించిన కృష్ణానది క్రాసింగ్ ఈత పోటీలలో 62 సంవత్సర విభాగంలో పాల్గొని 42.6 సెకండ్లలో మొదటి పది మందిలో ఒక స్థానాన్ని సంపాదించడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఇటీవల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గణతంత్ర అవార్డును స్వీకరించి అందరికీ ఆయన స్ఫూర్తిదాయకమయ్యారన్నారు.ఈ సందర్భంగా ఆయనను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఆయుష్ వైద్యులు డాక్టర్ శేఖర్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హేమంత్ బాబు, డాక్టర్ సరళ హిప్సిబా, డాక్టర్ రాజ్యలక్ష్మి వైద్య సిబ్బంది ఉన్నారు

## అగ్రికల్చర్ విద్యుత్ సరఫరాలో మార్పులు



**మనుబోలు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** మనుబోలు మండలంలో వ్యవసాయానికి ఇచ్చే కరెంటు సమ యాలు మార్పడం జరిగిందని ట్రాన్స్‌కో ఏఇ అనీల్ కుమార్ తెలిపారు.గతంలో రోజుకు 9గంటలు ఇస్తు న్న సరఫరాని 6వతేది నుండి మార్పు చేసి నట్లు తెలిపారు. 7 గంటలు ఇస్తున్నట్లు తెలిపారు. ఏగ్రూప్‌కి సంబంధించి ఉదయం 8.30 నుండి మద్య హ్నం 3.30 వరకు,బి గ్రూప్‌కి ఉదయం 10.30 నుండి సా యింత్రం 5.30 వరకు సవరించినట్లు తెలిపారు. ఏ గ్రూప్‌కి మనుబో లు, కాగితాలపూరు, బి గ్రూప్‌కి పిడూరు అని ఆయన తెలిపారు. రైతులు ఈవిషయానికి సహకరించాలని ఆయన కోరారు.

## అట్టహాసంగా కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు



**నెల్లూరు,ఫిబ్రవరి6 ప్రభాతవార్త-విద్య** కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలను గురువారం నగరంలోని స్థానిక అనిల్‌గార్డెన్స్‌లో విద్యా సంస్థల వ్యవస్థాపకులు ఆర్‌వి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డిల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విక్రమసింహ పురి యూనివర్శిటీ వైస్ చాన్సిలర్ ఆచార్య విజయభాస్కర రావు,తూర్పు రాయ లసీయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సిబిఐ జా యింట్ డైరెక్టర జేడీ లక్ష్మీనారాయణలు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. కళా శాల ప్రతిధులు ముఖ్యఅతిధులను పుష్పగుచ్చాలుఅందించి శాలువాలతో , పుష్ప మాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అకడమిక్ ఇయర్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన చిన్నారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు తమ విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకల్లో జేడీ లక్ష్మీనారాయణ, విఎస్‌యూ విసీ విజయభాస్కర్‌లు ముఖ్యఅతి ధులుగా పాలొ్గనటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు భావిభారత పౌరు లుగా ఎదగాలన్నారు. లక్ష్మీనారాయణ నిజాయితీ గల అధికారిగా పేరుగాంచి ఏంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల అభివృద్ధికి యూనివర్శిటీ అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. కేవలం కొద్ది మందితో ప్రారంభించిన తమ విద్యాసంస్థలు నేడు వేలమంది విద్యార్థులకు కలిగి ఉం డటం గర్వకారణమని తెలిపారు.రానున్న రోజుల్లో బిఫార్మసీ, ఇంజనీరింగ్ కళా శాలను ఏర్పాటుచేయనున్నామని ప్రకటించారు. జెడీ లక్ష్మీనారాయణ మా ట్లాడుతు ఎంతో మంది మహనీయులు జనియించిన పున్యగడ్డ సింహపురి అని, మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువత అభివృద్ధి చెందాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అమరులైన పొట్టి శ్రీరాములను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. విఎస్‌యూ విసీ విజయభాస్కర్ మాట్లాడుతు టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా విద్యార్థులు పుస్తక పటనాన్ని పెపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షనతో , ఉన్నతమైన లక్ష్యసాదనను ఏర్పాటుచేసుకుని అభి వృద్ధి చెందాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీన్స్ రామాంజనేయులు రెడ్డి, సుదారాణి, రాంగోపాల్‌రెడ్డి, పాయసం రమేష్,ఏఓ హరి, చిరంజీవి, అన్నీ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలను పాల్పడితే క్రిమినల్ కేసులు



**నెల్లూరు,ఫిబ్రవరి6 ప్రభాతవార్త-విద్య** 10నుండి ప్రారంభం కానున్న ఇంటర్ సైన్స్ విద్యార్థుల ప్రయోగపరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలను పాల్ప డినా ఉపేక్షించేది లేదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం నగరంలోని స్థానిక డికే జూని యర్ కళాశాలలో ఫిజిక్స్, బోటనీ అద్యాపకులకు శిక్షణా తరగతులు నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అవకతవకలను పాల్పిడిన కళా శాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమెదు చేయటంతోపాటూ ఆయా కళాశాలల అనుమతులు కూడా రద్దుచేయటం జరుగుతుందన్నారు. అన్నీ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుచేయ్యాలని, ప్రయోగపరీక్షలకు సంబంధించిన మెటీరియల్, మౌళిక వసతులు తదితర అంశాలను ఎగ్జామినర్లు ముందుగానే సరిచూసుకోవానలి సూచించారు. బోర్డు నిబందనల మేరకు పరీక్షలు పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం పరీక్షా ప్రతాల డౌన్‌లోడ్, వరీక్షల నిర్వహణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీన్‌దయాల్, పి.వేణుగోపాల్, ఎస్‌కే.గౌస్‌బాషా, ప్రభాకర్, కార్యాలయ సూపరింటెండెంట్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వీలనం చేసి మా పిల్లల్ని ఇబ్బందులు పెట్టవద్దు



**కలువాయి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి వేరే పాఠశాలలకు మార్చి మాపిల్లల్ని ఇబ్బందికి గురి చేయవద్దంటు తల్లి దండ్రులు, విద్యార్థులు కలువాయి వెస్టు ప్రాథమిక పాఠశాల నందు నిరసన తెలియజేశారు. మెర్జి పద్ధతిలో పాఠశాలలను విలీనం చేస్తు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో మండలంలోని కొన్ని ప్రాంతాలలో విద్యార్థులకు ఎదురు అయ్యే ఇబ్బందులు వివరిస్తు తల్లిదండ్రులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కలువాయిలోని ఈస్టు,గిరిజనీ కాలనీ ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎంఇఒ జి . శేషగిరిరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈస్టు పాఠశాల నందు ప్రస్తుతం 34 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతు తుండగా 3,4,5 తరగతుల విద్యార్థులను విలీనం ప్రక్రియలో భాగంగా వేరో పాఠశాలకు పంపడం అసౌకర్యంగా ఉంటుందని వినతి పత్రం వారు తెలియజేశారు.

**ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా చేయాలి**

కోరుతు మండలంలోని బద్దవోలు ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల గా చేయాలని కోరుతు ఆగ్రామ ప్రజాప్రతినిధులు గురువారం ఎఇఒ శేషగిరిరావుకి వినతి పత్రం అందజేశారు.ఎంఆర్‌సి నందు ఆ పాఠశాలకు సంబందించిన విద్యార్థులు నిరసన తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వ నిబందనలప్రకారం ఈ పాటశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పులు చేయచుండగా 6 నుండి 8 వ తరగతి వరకు చదువుతున్న 52 మంది అదే విధంగా 5 తరగతి నుండి 6 వ తరగతికివచ్చు 21 మంది మొత్తం 73 మంది విద్యార్థులు 4 కిలోమీటర్ల దూరంలో వెళ్ళేపాఠశాలకు అభ్యంతరంగా ఉందని వారు వినతిపత్రంలో తెలిపారు.

## టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడ్నిని కలిసిన మాదాసు



**కలువాయి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడ్ని మా జీ ఎంఎల్‌సి మాదాసు గంగాధరం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు నాయుడితో చర్చించారు.

## 9న ఆత్మకూరుకు మంత్రులు రాక

**- ఖరారైన మంత్రుల పర్యటన.. - మంత్రి ఆనం ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు.. - హాజరుకానున్న మంత్రులు ఫరూక్, నారాయణ, సవిత, బిసి జనార్ధన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి**



**నెల్లూరు ,ఫిబ్రవరి 6, ప్రభాత వార్త – కలెక్టరేట్** ఆత్మకూరు పట్టణంలో ఈనెల 9న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ఐదుగురు మంత్రులు, పార్లమెంటు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ మేరకు మంత్రుల పర్యటన ఖరారైంది. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, రాష్ట్ర రహదారులు, భవనముల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 9న ఆత్మకూరుకు విచ్చేయనున్నారు. 9వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో శ్రీ సీతారాములు స్వామివారి ఆలయానికి భూమిపూజ, ఉదయం 10.30 గంటలకు పంచాయతీరాజ్ అతిధి గృహ నిర్మాణానికి శంకుస్థాపన, 11 గంటలకు ఆర్అండ్‌బి అతిథిగృహం ప్రారంభోత్సవం, 11.30 గంటలకు నూతన బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో మంత్రులు, ఎంపీ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆత్మకూరు బిసి ఆర్ఎస్ బాలికల పాఠశాలలో పాత్రికేయుల సమావేశం అనంతరం పాఠశాలల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. ఈ కార్యక్రమాలకు ఆయాశాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన సిఐ వేమారెడ్డి



**సంగం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా సంగం మండల కేంద్రంలోని కొండ కూడలి వద్ద ట్రాక్టర్ డ్రైవర్లకు సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రహదారిపైన ట్రాక్టర్లు అతి వేగంగా నడపరాదని హెచ్చరించారు.అలాగే ట్రక్కు వెనుక ప్రమాదహెచ్చరికగా రేడియం రెడ్ స్టికర్ తప్పకుండా వేయాలని ఆయన సూచించారు.ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని హెచ్చరించారు .ఈకార్యక్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు,ట్రక్కు డ్రైవర్లున్నారు.

## నాని చిత్రపటానికి నివాళులర్పించిన డాక్టర్ నాయుడు



**బిట్రగుంట ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** బోగోలు మండలం అల్లిమడుగు సంఘం కు చెందిన సముద్రాల నాని ఆదరణ కూటము గురువారం వారి స్వగృహం నందు జరిగినది. ఈ సందర్భంగా కావలి మాజీ మున్సిపల్ చైర్మన్,ప్రజా వైద్యులు డాక్టర్ ఎన్ ప్రభాకర్ నాయుడు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అక్రమలేఔట్ల పైన కొరడా జులిపించిన అధికారులు



**బిట్రగుంట ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** బోగోలు మండలం లోని అక్రమలేఔట్లపైన ఎట్టకేలకు అధికారులు నడుంబిగించారు. నుడాఅధికారులు ఆదేశాలమేరకు ఇప్పుడు ముప్పిడిగా అనధికారికంగా వేసిన లేఔట్లను జెసిబి ద్వారా అధికారులు తొలగిస్తున్నారు మండలంలోని జువ్వలదిన్నె గ్రామంలో గురువారం అక్కడ మళ్ళీ అవుట్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల ఈ ఓ పి ఆర్ టి నయుం తాజా హసన్ జెసిబి ద్వారా తొలగించారు దీంతో లేవట్ల యజమానుల లేఔట్లయజమానుల గుండెల్లో రైళ్ళుపరిగెడుతున్నాయి.

## విద్యార్థి జీవితంలో పదవ తరగతి పునాది వంటిది




**కోవూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త :** విద్యార్థి జీవితంలో పదవ తరగతి పునాది వంటిదని ఈ విషయంలోనే విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని సెట్నల్ సీఈవో ఏ. నాగేశ్వరరావు అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత సమావేశ మందిరంలో గురువారం సెట్నల్ సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ఇటువంటి మోటివేషన్ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. వీటిని వారు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాటాడుతూ పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు. పరీక్షలకు ముందురోజు అర్థరాత్రి వరకు చదవడం వంటి విషయాలను మానుకుని మెదడును ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి రహీమ్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సుల వలన విద్యార్థుల యొక్క మెదడు మరింత పదును పడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ సదస్సులను విద్యార్థినులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ముఖ్యంగా భయాన్ని పారద్రోలి సమస్యలను విడనాడి ధైర్యంగా పరీక్షలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి , ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ మేనేజర్ డి. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎండీ గయాజ్ అహ్మద్, సైకాలజిస్ట్ డాక్టర్ వి. సురేష్‌బాబు, ఉపాధ్యాయులు గీతామాధురి, ఫిజికల్ డైరెక్టర్ దేవికారాణి, తదితరులు ఉన్నారు.